# జయహో.. కేసీఆర్

( మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన జరిగిన సభకు జనం భారీగా తరలివచ్చారు. ఉప ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. మునుగోడు అభివృద్ధిపై తనకు ప్రత్యేక శ్రద్ధ ఉందని, ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇక 29న కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. విద్యావేత్త, బీసీ బిడ్డ మల్లయ్యయాదవ్‌ను గెలిపించుకుని 50-60 శాతం ఉన్న బీసీలంతా తమ సత్తా చాటాలని కేసీఆర్ ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇక అదే రోజు తిరుమలగిరిలో జరిగిన తుంగతుర్తి సమరశంఖారావం సభలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు మద్దతుగా కేసీఆర్ మాట్లాడారు. పట్టుదల కలిగిన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రజలు తీసుకుంటే నియోజకవర్గం మొత్తానికి దళిత బంధు ఇచ్చే బాధ్యత తనదేనని కేసీఆర్ ప్రకటించడం విశేషం. తర్వాత ఆలేరులో ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. 'సునీతా నా సొంత బిడ్డ. సొంత బిడ్డ కోరిన కోరికలు తీర్చే బాధ్యత తండ్రిగా నాదే. సునీతను యాదాద్రి శిఖరమంత ఎత్తు ఓట్లతో గెలిపించండి. ఆలేరును తీర్చిదిద్దే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. మంగళవారం సాగర్ ఆయకట్టు పరిధిలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ నియోజక వర్గాల్లో శానంపూడి సైదిరెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావుకు మద్దతుగా ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. భువనగిరి నుంచి ఆసిఫ్‌నెహర్ కాల్వ ద్వారా గోదావరి జలాలను పానగల్ ఉదయ సముద్రంలోకి తీసుకొచ్చి అక్కడి నుంచి పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌లోకి తరలించే స్కీమ్ రెడీగా ఉన్నదని చెప్పారు. అది సాకారం కావాలంటే బీఆర్‌ఎస్‌ను మరొమారు గెలిపించాలని.. బీఆర్‌ఎస్‌తోనే సాగర్ ఆయకట్టులో నీళ్ల బాధకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సాయంత్రం దేవరకొండలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సభకు సామాన్య ప్రజలతో పాటు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. త్వరలోనే డిండి ఎత్తిపోతలను పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు దరిద్రాన్ని పారదోలుతానని కేసీఆర్ ప్రకటించగా చప్పట్లు మార్మోగాయి. 'రవీంద్రకుమార్ మంచి ఎమ్మెల్యే.. ఇదే పద్ధతిలో 70-80 వేల మెజారిటీతో ఆయన్ను గెలిపించాలి' అని కేసీఆర్ పిలుపునివ్వగా చేతులెత్తి జనం సమ్మతించారు. ఇలా అన్ని సభల్లోనూ కేసీఆర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇక నామినేషన్ల ప్రక్రియ అనంతరం మిగిలిన సూర్యాపేట, నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్ నియోజక వర్గాల సభల్లో కేసీఆర్ పాల్గొననున్నారు.

# ఓటమి భయంతోనే కాంగ్రెస్ హత్యా రాజకీయాలు



మోత్కూరు సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

మోత్కూరు, అక్టోబర్ 31 : ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ గుండాలు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తున్నట్లు తెలిపారు. దాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో అన్ని పార్టీలు స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారం చేసుకోవచ్చన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక హత్యా రాజకీయాలను ప్రేరేపించే పార్టీలను ప్రజలు భూస్థాపితం చేయాలని కోరారు. సమావేశంలో రైతు బంధు మండలాధ్యక్షుడు కొండ సోంమల్లు, ఎస్సీ, ఎస్టీ జిల్లా కమిటీ సభ్యులు దాసరి తిరుమలేశ్, పనకబండ సర్పంచ్ బత్తిని తిరుమలేశ్, బీఆర్‌ఎస్ నాయకులు మర్రి అనీల్‌కుమార్, విష్ణు, ధనుంజయ్య పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే దమ్ములేకే దాడులు..

అడ్డగూడూరు, అక్టోబర్ 31 : ఎన్నికల్లో ఎదుర్కొనే దమ్ములేకనే కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నదని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. దాడి చేయించిన కాంగ్రెస్ పార్టీ తీరును ప్రజలు ఎండగట్టాలన్నారు. దాడి సూత్రదారి రేవంత్‌రెడ్డే అని, ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## దాడి హేయనీయం..

అర్వపల్లి : ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దాడులు, హత్యాయత్నాలు సరికాదన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ భౌతిక దాడులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. సమావేశంలో ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మార్కెట్ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, బైరబోయిన రామలింగయ్య, గంగయ్య, సుందర్, లింగమూర్తి పాల్గొన్నారు.



అర్వపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సోమేశ్‌గౌడ్

# రైతుల అభ్యున్నతికి లవకుమార్ సేవలు మరువలేనివి

- అటారి హైదరాబాద్ డైరెక్టర్ షేక్ యన్ మీరా



లవకుమార్ దంపతులను సన్మానిస్తున్న ఎస్‌ఏఐఆర్డీ సిబ్బంది, రైతులు

గరిడేపల్లి, అక్టోబర్ 31 : రైతుల అబివృద్ధికి కేవీకే గడ్డిపల్లి సీనియర్ సైంటిస్ట్, పీసీ బూర్గు లవకుమార్ చేసిన సేవలు మరువలేనివని అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (అటారి) హైదరాబాద్ డైరెక్టర్ షేక్ యన్ మీరా అన్నారు. మంగళవారం మండలంలోని గడ్డిపల్లి కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బి.లవకుమార్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని కానీ వారు చేసిన సేవలు చిరకాలం గుర్తుండి పోతాయన్నారు. అందులో రైతులతో మమేకమైన వారిని మనస్సులో పదిలం చేసుకుంటారన్నారు. ఎస్‌ఏఐఆర్డీ సెక్రటరీ డాక్టర్ ఎం.స్నేహలత మాట్లాడుతూ.. కేవీకే ఏర్పాటు నుంచి లవకుమార్ రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన కృషి ఫలితంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక మంది రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగినట్లు తెలిపారు. అనంతరం లవకుమార్ దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఏఐఆర్డీ డైరెక్టర్ కేపీ రెడ్డి, కేవీకే డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, గడ్డిపల్లి, కంపాసాగర్ కేవీకేల శాస్త్రవేత్తలు, డీఎఫ్ఓ రూపేందర్‌సింగ్, పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆరోగ్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

నూతనకల్, అక్టోబర్ 31 : ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించే కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 32 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న 19 మందికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు తుంగతుర్తిలో ఎమ్మెల్యే కిశోర్ ప్రచారం

తుంగతుర్తి, అక్టోబర్ 31 : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బుధవారం మండలంలో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఉదయం 8 గంటలకు తూర్పుగూడెం గ్రామ పంచాయతీ నుంచి ప్రచారం ప్రారంభించి గానుగుబండ, కొత్తగూడెం, కర్విరాల, దేవునిగుట్ట తండా, రామన్నగూడెంతండా, సూర్య తండా, మంచితండా, బండరామారంలో ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## రేపు అడ్డగూడూరులో ఎమ్మెల్యే కిశోర్ ఎన్నికల ప్రచారం

అడ్డగూడూరు, అక్టోబర్ 31 : అడ్డగూడూరు మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీదేవికాల్వ, ధర్మారం, గోవిందాపురం, మానాయికుంట, గట్టుసింగారం, జానకీపురం, చిన్నపడిశాల, చౌళ్లరామారం గ్రామాల్లో ప్రచారం చేయనున్నట్లు వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మండల ప్రత్యేకాధికారి యాదయ్య



మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి యాదయ్య

మోత్కూరు, అక్టోబర్ 31 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య కోరారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలోని పొడిచేడు, బుజిలాపురం, అనాజిపురం, సంఘం పరిధిలోని రహీంఖాన్‌పేట, ఖపురాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183 చొప్పున మద్దతు ధర ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, ఏఓ స్వప్న, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, సీఓ కొణతం వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## పరామర్శ

నాగారం, అక్టోబర్ 31 : నాగారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కన్నెబోయిన అయిలయ్య కుటుంబ సభ్యులను ఎంపీపీ కూరం మణీవెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కో-ఆర్డినేటర్ గుండగాని అంబయ్య, ఉప సర్పంచ్ కన్నెబోయిన భద్రయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనంతుల సత్తయ్య, కత్తుల వెంకన్న, చిప్పలపల్లి సోమయ్య, ఎలుక సైదులు పాల్గొన్నారు.

### నివాళి ..

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త భూపతి లక్ష్మమ్మ అనారోగ్యంతో మరణించింది. భౌతికకాయాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కందుల దశరథ రామారావు, నిమ్మల లింగయ్య, తండా లింగమూర్తి, భూర్గుల రాంబాబు పాల్గొన్నారు.

## అభివృద్ధిని గడప గడపకూ వివరించాలి

నూతనకల్, అక్టోబర్ 31 : ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడప గడపకూ వెళ్లి వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ గోరుగంటి ఉషారామకిషన్, ఉప సర్పంచ్ మున్న లింగయ్య, ఎంపీటీసీ మున్న లక్ష్మి, నాయకులు గంగయ్య, లింగయ్య, మధు పాల్గొన్నారు.